# నేటి నుంచే జర్మన్ ఓపెన్

ముల్హీమ్ (జర్మనీ): కొద్దిరోజుల క్రితమే చైనాలో ముగిసిన ఆసియా మిక్స్‌డ్ టీమ్ చాంపియన్‌షిప్‌లో క్వార్టర్స్‌లోనే ఇంటి ముఖం పట్టిన భారత షట్లర్లు స్వల్ప విరామం తర్వాత మరో బ్యాడ్మింటన్ ప్రపంచ టూర్ (బీడబ్ల్యూఎఫ్) ఈవెంట్‌కు సిద్ధమయ్యారు. జర్మనీలోని ముల్హీమ్ వేదికగా జరుగబోయే బీడబ్ల్యూఎఫ్- సూపర్ 300 ఈవెంట్‌లో షట్లర్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. పీవీ సింధు, సాత్విక్-చిరాగ్ ద్వయం, లక్ష్యసేన్, హెచ్‌ఎస్ ప్రణయ్ వంటి స్టార్ షట్లర్లు పలు కారణాలతో ఈ ఈవెంట్ నుంచి తప్పుకోగా భారత దళాన్ని మాజీ వరల్డ్ నంబర్‌వన్ కిడాంబి శ్రీకాంత్ నడిపించనున్నాడు. ప్రస్తుతం 45 ప్రపంచ ర్యాంకర్ అయిన శ్రీకాంత్.. తొలి మ్యాచ్‌లో భారత్‌కే చెందిన యువ సంచలనం ప్రియాన్షు రజావత్‌తో తలపడనున్నాడు. కిరణ్ జార్జి కూడా అయూష్ శెట్టి (భారత్)తో ఆడాల్సి ఉంది. మహిళల సింగిల్స్‌లో అనుపమ, ఇషారాణి ఆకర్షి, రక్షిత రామ్‌రాజ్, అన్మోల్ ఖర్బ్ వంటి యువ క్రీడాకారులు బరిలో నిలిచారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల-తనీషా క్రాస్టో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనుంది.

# సెమీస్‌పై కన్ను

**నేడు ఆసీస్, దక్షిణాఫ్రికా కీలక పోరు**

రావల్పిండి: చాంపియన్స్ ట్రోఫీలో మంగళవారం రెండు అగ్రశ్రేణి జట్ల మధ్య రసవత్తర సమరానికి తెరలేవనుంది. టోర్నీలో అంచనాలే లేకుండా బరిలోకి దిగి తొలి మ్యాచ్‌లోనే ఇంగ్లండ్‌పై రికార్డు ఛేదన (356)ను దంచేసిన ఆస్ట్రేలియా.. రావల్పిండిలో దక్షిణాఫ్రికాను ఢీకొననుంది. తమ తొలి మ్యాచ్‌లో సౌతాఫ్రికా.. అఫ్గానిస్థాన్‌పై అలవోక విజయం సాధించిన జోష్‌లో ఉంది. కాగా మంగళవారం మ్యాచ్‌లో గెలిచిన జట్టు సెమీస్ బెర్తును ఖాయం చేసుకునే అవకాశమున్న నేపథ్యంలో ఈ పోరు ఉత్కంఠగా సాగడం ఖాయం! ఆసీస్ మిడిలార్డర్ బ్యాటర్లు షార్ట్, ఇంగ్లిస్, లబూషేన్, మ్యాక్స్‌వెల్.. సఫారీ పేసర్లు రబాడా, ఎంగిడి, జాన్సెన్‌ను ఏ

మేరకు ఎదుర్కొంటారనేది ఆసక్తికరం. ఇక సఫారీ బౌలింగ్ యూనిట్‌తో పోలిస్తే కాస్త బలహీనంగా కనిపిస్తున్నా ఆసీస్.. దక్షిణాఫ్రికా బ్యాటర్లను ఎలా నియంత్రిస్తుందో చూడాలి.

# భారత హాకీ జట్లకు నిరాశ

**ఇంగ్లండ్, నెదర్లాండ్స్ చేతిలో ఓటమి**

భువనేశ్వర్: ఎఫ్ఐహెచ్ ప్రో లీగ్‌లో భారత అమ్మాయిల హాకీ జట్టు వైఫల్యాల పరంపర కొనసాగుతోంది. సోమవారం ఇక్కడి కళింగ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో భారత్.. 2-4తో నెదర్లాండ్స్ చేతిలో పరాభవం పాలైంది. ఉదిత (18ని, 42ని)లో రెండు పెనాల్టీ కార్నర్‌లను గోల్స్‌గా మలిచింది. ఈ టోర్నీలో ఆడిన ఏడు మ్యాచ్‌లలో మన అమ్మాయిలకు ఇది నాలుగో పరాజయం. ఇక అబ్బాయిల పోరులో ఇంగ్లండ్ 3-2తో భారత్‌ను ఓడించింది. 18వ నిమిషంలో అభిషేక్, 39వ నిమిషంలో సుఖ్‌జీత్ సింగ్ తలా ఓ గోల్ చేశారు. ఇంగ్లండ్ తరపున జాకబ్ పేటన్ (15ని.) తొలి గోల్ చేయగా సామ్ వర్డ్ (19ని, 29ని.) రెండు గోల్స్ చేశాడు.

# సెమీస్‌లో కివీస్

**పాక్, బంగ్లా ఔట్**
**రచిన్ శతక జోరు**
**చాంపియన్స్ ట్రోఫీ**

బ్రాస్‌వెల్ (11*, 4/26)

రచిన్ (112)

రావల్పిండి: ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో భాగంగా న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో బంగ్లాదేశ్ ఓటమి ఆతిథ్య పాకిస్థాన్ చావుకొచ్చింది. సోమవారం రావల్పిండి వేదికగా కివీస్‌తో కీలక పోరులో బంగ్లాదేశ్.. 5 వికెట్ల తేడాతో పరాజయం పాలైంది. దీంతో బంగ్లాతో పాటు డిఫెండింగ్ చాంపియన్ పాక్ కూడా అధికారికంగా టోర్నీ నుంచి నిష్క్రమించాయి. గ్రూప్-ఏలో టాప్-2లో నిలిచిన భారత్, కివీస్ సెమీస్ బెర్తులను ఖాయం చేసుకున్నాయి. ఇటీవలే ముక్కోణపు వన్డే సిరీస్‌లో గాయపడి తిరిగి రీఎంట్రీ ఇచ్చిన రచిన్ రవీంద్ర (105 బంతుల్లో 112, 12 ఫోర్లు, 1 సిక్స్) శతకంతో చెలరేగడంతో బంగ్లా నిర్దేశించిన 237 పరుగుల లక్ష్యఛేదనలో కివీస్.. 46.1 ఓవర్లలో 240 పరుగులు చేసింది. రచిన్‌తో పాటు లాథమ్ (55) మెరిశాడు. తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ నిర్ణీత ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 236 పరుగులు చేసింది. కెప్టెన్ నజ్ముల్ హోసేన్ శాంతో (110 బంతుల్లో 77, 9 ఫోర్లు), జేకర్ అలీ (45) ఆ జట్టును ఆదుకున్నారు. కివీస్ స్పిన్నర్ మైఖెల్ బ్రాస్‌వెల్ (4/26), విలియమ్ ఓరూర్క్ (2/48) బంగ్లాను కట్టడిచేశారు. లీగ్ దశలో కివీస్.. మార్చి 2న దుబాయ్‌లో టీమ్‌ఇండియాతో తలపడనుంది.

**రచిన్.. దంచెన్**

స్వల్ప విరామం తర్వాత ఫీల్డ్‌లోకి అడుగుపెట్టిన రచిన్.. కివీస్ విజయంలో కీలకపాత్ర పోషించాడు. ఛేదనలో 15 పరుగులకే న్యూజిలాండ్ రెండు కీలక వికెట్లు కోల్పోయిన వేళ బ్యాటింగ్‌కు వచ్చిన అతడు.. కాన్వేతో మూడో వికెట్‌కు 57, లాథమ్‌తో నాలుగో వికెట్‌కు 129 రన్స్ జోడించాడు. 95 బంతుల్లో శతకం పూర్తిచేసిన రచిన్.. ఐసీసీ టోర్నీ (వన్డే)లలో కివీస్ తరపున అత్యధిక శతకాలు (11 ఇన్నింగ్స్‌లలో 4) బాదిన క్రికెటర్‌గా రికార్డులకెక్కాడు. గతంలో ఈ రికార్డు కేన్ విలియమ్సన్ (34 ఇన్నింగ్స్‌లలో 3) పేరిట ఉండేది.

**బ్రాస్‌వెల్ ధాటికి విలవిల**

టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు వచ్చిన బంగ్లాదేశ్‌కు ఓపెనర్లు తాంజిద్ హసన్ (24), శాంతో తొలి వికెట్‌కు 45 పరుగులు జోడించి మంచి ఆరంభమే ఇచ్చారు. కానీ బ్రాస్‌వెల్, ఓరూర్క్ క్రమం తప్పకుండా వికెట్లు పడగొడుతూ బంగ్లాను ఒత్తిడిలోకి నెట్టారు. 9వ ఓవర్లో తాంజిద్‌ను బ్రాస్‌వెల్ ఔట్ చేయగా మిరాజ్ (13)ను ఓరూర్క్ పెవిలియన్‌కు పంపాడు. ఆ తర్వాత బ్రాస్‌వెల్ వరుస ఓవర్లలో తౌహిద్ (7), ముష్ఫీకర్ (2), మహ్మదుల్లా (4)ను బోల్తా కొట్టించాడు. శాంతో క్రీజులో పాతుకుపోయినా అతడు వేగంగా పరుగులు సాధించలేకపోయాడు. ఆఖర్లో జేకర్, రిషద్ (26) బంగ్లా పరువు నిలిపారు.

**సంక్షిప్త స్కోర్లు**

**బంగ్లాదేశ్:** 50 ఓవర్లలో 236/9 (శాంతో 77, జేకర్ 45, బ్రాస్‌వెల్ 4/26, ఓరూర్క్ 2/48);**న్యూజిలాండ్:** 46.1 ఓవర్లలో 240/5 (రచిన్ 112, లాథమ్ 55, టస్కిన్ 1/28, ముస్తాఫిజుర్ 1/42)

## ఫ్చ్.. పాక్! ఐదు రోజుల్లోనే ఔట్

లాహోర్: రాక రాక వచ్చిన ఆతిథ్య హక్కులు! వాటిని కాపాడుకోవడానికి రెండేండ్లపాటు పడ్డ శ్రమ!! భద్రతా కారణాలతో భారత్.. పాక్‌కు వెళ్లననడం, అందుకు ఆ దేశం మొండిపట్టు పట్టి 'హైబ్రిడ్ మోడల్'కు ససేమిరా ఒప్పుకోకపోవడంతో అసలు టోర్నీ అక్కడ జరుగుతుందా? లేదా? అన్న ఆందోళన. ఎట్టకేలకు పీసీబీ అందుకు ఒప్పుకున్నాక.. స్వదేశంలో తమ జట్టు ఐసీసీ టోర్నీని ముద్దాడితే చూద్దామని యావత్ దేశం కన్న కలలు కల్లలే అయ్యాయి. ఈనెల 19న మొదలైన పాకిస్థాన్ ట్రోఫీ వేట.. ఐదంటే ఐదు రోజుల్లో రెండు మ్యాచ్‌లతోనే ముగిసింది. తొలి మ్యాచ్‌లో కివీస్ చేతిలో ఓడిన పాక్.. రెండో మ్యాచ్‌లో చిరకాల ప్రత్యర్థి టీమ్‌ఇండియా చేతిలోనూ ఘోరంగా ఓడిపోయి టోర్నీ నుంచి అనధికారికంగా నిష్క్రమించింది. తాజాగా బంగ్లాదేశ్.. కివీస్ చేతిలో ఓడటంతో ఈ టోర్నీ నుంచి డిఫెండింగ్ చాంపియన్ నిష్క్రమణ అధికారికంగా ఖరారైంది. తమ అభిమాన ఆటగాళ్ల మెరుపులను టోర్నీ ఆసాంతం వీక్షిద్దామని కలలు కన్న పాక్ ఫ్యాన్స్‌ను తీవ్ర నిరాశలో ముంచెత్తుతూ రిజ్వాన్ సేన ఐదు రోజుల్లోనే తమ పోరాటాన్ని చాలించింది.

ఎకల్‌స్టోన్

# యూపీ సూపర్

**ఆర్‌సీబీపై ఉత్కంఠ విజయం**

**అదరగొట్టిన ఎకల్‌స్టోన్**

బెంగళూరు: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) మరో పోరు అభిమానులను కట్టిపడేసింది. ఆఖరి బంతి వరకు నువ్వానేనా అన్నట్లు సాగిన పోరు పసందైన విందు అందించింది. సోమవారం డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ)తో హోరాహోరీగా సాగిన పోరులో యూపీ వారియర్స్(సూపర్ ఓవర్)నే విజయం వరించింది. డబ్ల్యూపీఎల్ చరిత్రలో తొలి సూపర్ ఓవర్ మ్యాచ్‌గా రికార్డుల్లోకెక్కింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన యూపీ ఆరు బంతుల్లో హెన్రీ(4) వికెట్ కోల్పోయి 8 పరుగులు చేసింది. గారెత్‌కు వికెట్ దక్కింది. ఆ తర్వాత బ్యాటింగ్‌కు వచ్చిన ఆర్‌సీబీ 4 పరుగులకే పరిమితమై ఓటమి కొనితెచ్చుకుంది. బ్యాటింగ్‌లో ఆకట్టుకున్న ఎకల్‌స్టోన్..కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ఆర్‌సీబీ బ్యాటర్లు మందన, రిచాఘోష్‌ను నిలువరించింది. మొత్తంగా యూపీ విజయంలో ఎకల్‌స్టోన్ కీలకంగా వ్యవహరించింది. అంతకుముందు ఆర్‌సీబీ నిర్దేశించిన 181 పరుగుల లక్ష్యఛేదనలో యూపీ 20 ఓవర్లలో 180 స్కోరు చేసింది. ఎకల్‌స్టోన్(33), శ్వేతా సెహ్రావత్(31), కెప్టెన్ దీప్తిశర్మ(25) మినహా అందరూ ఘోరంగా విఫలమయ్యారు. స్నేహ్ రానా(3/27), రేణుకా సింగ్(2/36), కిమ్ గారెత్(2/40) రాణించారు. తొలుత ఎలీస్ ఎర్రీ(56 బంతుల్లో 90 నాటౌట్, 9ఫోర్లు, 3సిక్స్‌లు) ధనాధన్ అర్ధసెంచరీతో ఆర్‌సీబీ 20 ఓవర్లలో 180/6 స్కోరు చేసింది. డానీ వ్యాట్(57) ఆకట్టుకుంది. హెన్రీ, దీప్తి, మెక్‌గ్రాత్ ఒక్కో వికెట్ తీశారు.

# దవాఖాన ఖర్చులకు పైసలియ్యండి

- **ఐసీసీకి పాక్ అభిమాని వేడుకోలు**

లాహోర్: భారత్ చేతిలో ఓటమి పాకిస్థాన్ అభిమానులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నది. తలపడినా ప్రతీసారి పాక్ టీమ్ ఓటమి ఎదుర్కొంటున్న వేళ ఆ దేశ అభిమానుల్లో అసహనం అంతకంతకూ పెరుగుతూ పోతున్నది. ఇప్పటికే పలువురు మాజీ క్రికెటర్లు దుమ్మెత్తిపోస్తుండగా, ఫ్యాన్స్ తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. ఇంకా ఎన్ని రోజులు ఇలాంటి బాధలు అనుభవించాలంటూ ఓ పాక్ అభిమాని ఐసీసీకి రాసిన అభ్యర్థన లేఖ వైరల్‌గా మారింది. 'ఇప్పటి నుంచైనా భారత్, పాకిస్థాన్ జట్లను ఒక గ్రూపులో ఉంచకండి. ప్రతీసారి టీమ్‌ఇండియా చేతిలో ఓటమి తట్టుకోలేకపోతున్నాం.

ఒకవేళ తప్పనిసరి పరిస్థితుల్లో ఉంచితే మ్యాచ్ ద్వారా వచ్చే ఆదాయాన్ని ఒత్తిడి నుంచి దూరమయ్యేందుకు అయ్యే దవాఖాన ఖర్చుల కోసం పాక్ అభిమానులకు కేటాయించండి. ఇది వీలు కాకపోతే మ్యాచ్‌తో వచ్చే ఆదాయంలో ఎంతో కొంత పాక్ ఫ్యాన్స్‌కు ఇవ్వండి' అని రాసుకొచ్చాడు. ఇటీవల కాలంలో జరుగుతున్న ఐసీసీ టోర్నీల్లో పాక్‌పై భారత్‌దే పైచేయిగా కొనసాగుతున్నది.

# మాపై చేతబడి చేసి గెలిచారు

**ఓటమిపై పాక్ మీడియాలో వింత వాదన**

దుబాయ్: దాయాది పోరులో భాగంగా టీమ్‌ఇండియా చేతిలో చావుదెబ్బ తిని టోర్నీ నుంచి నిష్క్రమించిన పాకిస్థాన్ ఓటమిపై అక్కడి మీడియా వింత వాదనలు చేస్తోంది. భారత్.. 22 మంది పూజారులను తీసుకొచ్చి తమ జట్టుపై చేతబడి ప్రయోగించి గెలిచిందని వాదించింది. ఓ టీవీ (డిస్కవర్ పాకిస్థాన్) చర్చలో పాల్గొన్న పలువురు వక్తలలో ఒకరు మాట్లాడుతూ.. 'భారత్ 22 మంది హిందూ పూజారులను దుబాయ్‌కు పంపి పాక్ ఆటగాళ్ల ఏకాగ్రతను దెబ్బతీసే విధంగా చేతబడి చేయించింది' అని అన్నాడు. మరో వక్త మాట్లాడుతూ 'ఈ కారణం (చేతబడి)తోనే భారత్.. పాకిస్థాన్‌కు వచ్చి ఆడేందుకు నిరాకరించింది. ఎందుకంటే మనం ఇక్కడ పూజారులను అనుమతించం కదా' అని వ్యాఖ్యానించాడు. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.